## క్లుప్తంగా

### హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన మహితకు సన్మానం



చాట్రాయి: మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన మోరంపూడి పూర్ణచంద్ర రావు కుమార్తె మహిత హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టుకు 20 మంది న్యాయమూర్తులను ఎంపిక చేయడంతో మహితకు అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా సామాజిక చైతన్యవేదిక ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం తదితరులు మహితను శనివారం ఘనంగా సన్మానించారు.

### మైలవరంలో భారీ వర్షం

మైలవరం: మైలవరంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండతో ఇబ్బందులు పడిన ప్రజలు, మధ్యాహ్నం కారుమబ్బులు కమ్మి ఆకస్మాత్తుగా కురిసిన వర్షానికి కొంత సేదతీరారు. వర్షంతో అంతర్గత రహదారులపై నీరు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. మైలవరంలో ఒక మిల్లీమీటరు వర్షం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం తెలిపింది.

### అంతర్జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు

మైలవరం: కలలు కనడంతో పాటు వాటిని సాకారం చేసుకునే దిశగా అవిశ్రాంతంగా శ్రమించే యువతరానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఏ దేశానికైనా ఉత్తమ వనరులు యువతేనని, సృజనాత్మకత, సంకల్పం, శక్తియుక్తులు, అంకిత భావంతో ప్రతి అవరోధాన్ని అధిగమిస్తూ లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎమ్మెల్యే వసంత ఒక ప్రకటనలో తెలిపారు.

### రహదారిపై గొయ్యి పూడ్చివేత



చాట్రాయి: ఆర్అండ్బీ రోడ్డుపై పడిన గొయ్యి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎన్టీఆర్ జిల్లా నర్సాపురం మండలంలోని సూరంపాలెం గ్రామానికి దగ్గరలో ఉన్న ఎన్ఎస్పీ రోడ్డు వంతెన వద్ద పెద్ద గొయ్యి పడింది. సత్తుపల్లి- విజయవాడ రహదారి కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో సూరంపాలెం గ్రామానికి చెందిన గంటా విమలయ్య సహకారంతో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో సిమెంట్ కాంక్రీట్తో గొయ్యిను పూడ్చివేశారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

### సొబ్బాలలో రూ.1.40 లక్షల సొత్తు చోరీ

సొబ్బాల(గంపలగూడెం): మండల పరిధిలోని సొబ్బాల గ్రామంలో గద్దల మధుబాబు అనే వ్యక్తి ఇంట్లో శనివారం దొంగలు పడి బంగారం, నగదు దోచుకెళ్లారని ఎస్.రాంబాబు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన మధుబాబు కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చే సరికి బీరువా తెరిచి ఉండటంతో ఆందోళన చెందారన్నారు. ఇంట్లో పరిశీలించగా బీరువాలో దాచిన రూ.1.30 లక్షల విలువైన బంగారు నానుతాడు, ఒక జత చెవి బుట్టలు, ఒక జత జుకాలు, రూ.10 వేల నగదు అపహరణకు గురైందన్నారు. బాధితుడు మధుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ చెప్పారు.





# అతివలకు ఆర్థిక స్వావలంబన

- నియోజకవర్గంలో 67,845 మంది మహిళలకు లబ్ధి
- సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.8.28 కోట్ల చెల్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అక్కా చెల్లెమ్మలు



సమావేశమైన స్వయం సహాయక సంఘాల మహిళలు (ఫైల్)

నూజివీడు: స్వయం సహాయక సంఘాలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి అమలు చేస్తూ అతివల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు పథకాలు అమలు చేస్తూనే సక్రమంగా రుణాలను తిరిగి చెల్లించిన మహిళలకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న మహిళా మార్ట్లు, బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు తదితర పథకాలతో మహిళలను ఆదుకుంటున్న ప్రభుత్వం లింకేజీ రుణాలు తీసుకొని సక్రమంగా చెల్లిస్తున్న గ్రూపులకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందజేస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగో విడత సున్నా వడ్డీని మహిళల బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. సున్నా వడ్డీ సొమ్మును ఏటా అందజేస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి సున్నా వడ్డీని అమలు చేయడాన్నే పక్కన పెట్టింది. దానికి భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీని అందిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలను ఆదుకుంటోంది.

**6,400 సంఘాలకు జమ**

నియోజకవర్గంలోని నూజివీడు పట్టణం, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో 6,400 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. రూ.8.28 కోట్ల నగదును ఆయా సంఘాల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి శుక్రవారం నాలుగో విడత సున్నా వడ్డీ నగదును జమ చేశారు. దీని ద్వారా 67,845 మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రుణాలను సక్రమంగా చెల్లించిన గ్రూపులకు ఈ సున్నా వడ్డీని అందజేసింది.

**మండలాల వారీగా సున్నా వడ్డీ వివరాలు**

| మండలం | డ్వాక్రా గ్రూపుల సంఖ్య | మొత్తం సభ్యులు | నగదు |
|---|---|---|---|
| నూజివీడు | 1,688 | 17,799 | రూ.2.14 కోట్లు |
| నూజివీడు(అర్బన్) | 729 | 7,570 | రూ.0.97 కోట్లు |
| ఆగిరిపల్లి | 1,230 | 13,094 | రూ.1.68 కోట్లు |
| ముసునూరు | 1,470 | 15,542 | రూ.1.99 కోట్లు |
| చాట్రాయి | 1,283 | 13,840 | రూ.1.50 కోట్లు |
| మొత్తం | 6,400 | 67,845 | రూ.8.28 కోట్లు |

### మహిళలకు వరం సున్నావడ్డీ



క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం సున్నావడ్డీని ఏటా అందిస్తోంది. దీంతో మహిళలు కూడా రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నారు. గ్రూపుల్లోని మహిళలకు సున్నా వడ్డీ వరం. వడ్డీ రాయితీ లభిస్తుండటంతో వారిపై భారం తగ్గుతుంది.

– దయాల రాజశేఖర్, ఏపీఎం, నూజివీడు

## పెండింగ్ కేసులను పరిష్కరించాలి



నూజివీడులో మాట్లాడుతున్న డీఎస్పీ ఈడే అశోక్కుమార్ గౌడ్

నూజివీడు: నూజివీడు పోలీస్ సబ్డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ ఈడే అశోక్కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డివిజన్లోని సీఐలు, ఎస్ఐలతో శనివారం కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మహిళల భద్రత విషయంలో నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల సర్పంచ్లు, వార్డు సభ్యుల ఎన్నికకు ఉప ఎన్నికలు జరుగుతున్నందున పటిష్టమైన భద్రత చర్యలు తీసుకొని శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ, కౌంటింగ్ వంటి సందర్భాల్లో ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో సీఐలు రాజులపాటి అంకబాబు, ఎంవీవీఎస్ఎన్మూర్తి, సబ్ డివిజన్లోని ఎస్ఐలు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



ముసునూరు బాలుర హాస్టల్లో మాట్లాడుతున్న నజీర్

ముసునూరు: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ సూచించారు. స్థానిక బీసీ బాలుర హాస్టల్లో హాస్టల్ వార్డెన్ అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం శనివారం నిర్వహించారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న సమావేశానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై తమ పిల్లల బాగోగులను తెలుసుకోవాలన్నారు. అనంతరం 69 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించి, వారికి పిల్లల విద్యా ప్రగతి, నడవడికను వివరించారు. కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు తులిమెల్లి రంగారావు, హాస్టల్ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 8 నుంచి శ్రీ వైభవ మహాలక్ష్మీ యాగం



యాగం వాల్పోస్టర్ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశ సంరక్షణ, సౌభాగ్యం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శ్రావణమాసం నాలుగో శుక్రవారం సెప్టెంబర్ 8 నుంచి 13వ తేదీ వరకు సింగ్నగర్లోని బసవపున్నయ్య స్టేడియంలో శ్రీ వైభవ మహాలక్ష్మీయాగం నిర్వహించనున్నట్లు యాగం కన్వీనర్ కె.ఎస్. దీక్షితులు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓకే సిల్క్ ప్రతినిధి వర్ల శ్యాంప్రసాద్ వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీక్షితులు మాట్లాడుతూ శ్రీ శివజ్ఞాన పీఠాధిపతులు శివాచార్యస్వామి సమక్షంలో శ్రావణ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ యాగంలో రోజూ మహిళలతో సామూహిక కోటి రెణువుల కుంకుమార్చన, హోమ కార్యక్రమాలు, వెండి కమల పుష్పార్చన, సాయంత్రం భక్తులతో సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం యాగ స్థలం వీధుల్లో ఊరేగింపు, స్వామి వారి అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. యాగం చివరి రోజున ఉదయం 11.25 గంటలకు యాగ పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు యజ్ఞ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగలింగం శివాజీ, పి.శ్యాంప్రసాద్, సుదర్శన్, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్లో రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ముస్లిం, క్రైస్తవుల శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, పాస్టర్లు, మైనార్టీ, రాజకీయ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని పలువురు ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు డిమాండ్ చేశారు. మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో శనివారం సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడదాం, లౌకిక రాజ్యాన్ని స్థాపిద్దాం అంటూ నినాదాలతో క్రైస్తవ, ముస్లిం, మైనార్టీ సంఘాల ఐక్య వేదిక(జేఏసీ) ఆధ్వర్యంలో ముస్లింలు, క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్జీఎస్ కళాశాల నుంచి మొదలైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగింది. మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో క్రైస్తవులపై, ముస్లింలపై ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్, హర్యానాలలో అఘాయిత్యాలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కూల్చిన ఇళ్లను, చర్చిలను, మసీదులను పునర్నిర్మించాలని కోరారు.

### రహదారి నిర్మాణానికి భూమిపూజ



ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం 16వ వార్డులో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కొండపల్లిలో 181, 182 పోలింగ్ బూత్ పరిధిలో బూత్ లెవల్ అధికారులు చేపట్టిన ఓటర్ల వెరిఫికేషన్ పరిశీలించారు. పారదర్శకంగా ఓటర్ల రీవెరిఫికేషన్ నిర్వహించాలని సూచించారు.

### కళాశాల పురోభివృద్ధికి సహకరించాలి

జూపూడి(ఇబ్రహీంపట్నం): కళాశాల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని నిమ్రా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ అన్నారు. ఫార్మసీ పూర్వ విద్యార్థుల సమావేశం కళాశాలలో శనివారం జరిగింది. ప్రిన్సిపాల్ జనార్దన్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నా తాము చదివిన కళాశాలను మర్చిపోకూడదన్నారు. ప్రస్తుత విద్యార్థులకు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. 100 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### జాతీయ పతాకాల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివర్ణ జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగుర వేయాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ జాతీయ భావాన్ని పెంపొందించే విధంగా పోస్టల్ శాఖ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. పోస్టల్ యూనియన్ నాయకులు వసంతరావు, పోస్టు మాస్టర్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జగ్గయ్యపేటఅర్బన్: మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని జైహింద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఉక్కు కళావేదికలో శనివారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ వారి ద్వారా జగ్గయ్యపేటలో మహిళలు, ఔత్సాహికులకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెటింగ్, ఆర్థిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు రుణాలను పొందే మార్గాలను వివరించారు. ముఖ్యంగా మహిళలు వారి స్వశక్తిపై ఆధారపడే విధంగా పలు పథకాలను వివరించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ఉషారాణి, మునిని రాజ్యలక్ష్మి, చంద్రమౌళి, కిరణ్, రామేశ్వరి, రాజ్యలక్ష్మి, నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి



ఎరుకోపాడులో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్లో పాల్గొన్న ఎమ్మెల్యే రక్షణనిధి



రోలుపడిలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

ఎమ్మెల్యే రక్షణనిధి

ఎరుకోపాడు(తిరువూరురూరల్): స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. మండలంలోని ఎరుకోపాడులో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గ్రామ సచివాలయంలో, మండల పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, చింతలపాడు పీఏసీఎస్ చైర్మన్ గుడిపూడి నారాయణరావు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**రోలుపడిలో..**

రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడిలో శనివారం ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమం జరిగింది. సచివాలయం వద్ద సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ బండి రవికుమార్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు అమరవీరులకు నివాళులర్పించారు. గ్రామంలోని పాఠశాలల్లో, సచివాలయం వద్ద మొక్కలు నాటారు.

## విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి



మైలవరంలో మాట్లాడుతున్న కోటిరెడ్డి

మైలవరం: విద్యార్థి దశలోనే లక్ష్యం ఏర్పాటు చేసుకుని చదివితే భవిష్యత్లో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని 316డి లయన్స్ పాస్ట్ గవర్నర్ ఏ.కోటిరెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్పై విద్యార్థులకు శనివారం స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో అవగాహనా సదస్సు జరిగింది. సదస్సులో కోటిరెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ అని, ఆ సంస్థ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థిలో అమోఘమైన శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞా పాటవాలు కలిగి ఉంటారని, వారిలో ఉన్న తెలివితేటలు గుర్తించి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లడం ద్వారా కలిగే విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. విజయం సాధించడానికి కోరిక కలిగి ఉండాలని, ఆ కోరిక వల్ల ఆసక్తి, ఏకాగ్రత, మెదడు దారణ శక్తి పెరుగుతుందని చెప్పారు. జీవితంలో ప్రతి మనిషికీ కొన్ని అవరోధాలు కలుగుతుంటాయని, వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ చలువాది హరీష్కుమార్ గుప్తా, ట్రెజరర్ తిమ్మెన దినేష్బాబు, మెంబర్షిప్ చైర్పర్సన్ శీలం రామిరెడ్డి, ఎస్వీ రాజీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వికాస్ విద్యార్థులకు అవగాహన సదస్సు**

రెడ్డిగూడెం: వికాస్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల నందు విస్సన్నపేట లయన్స్క్లబ్ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్ ప్రోగ్రామ్ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్ అన్నవరపు కోటిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు ఆత్మ విశ్వాసంతో పట్టుదలతో, నిరంతర శ్రమతో అవరోధాలను అధిగమించి విజయాన్ని సాధించాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరటానికి ఏకైక రాజమార్గం చదువు ఒక్కటేనని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, లయన్స్క్లబ్ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాస్, జగన్ మోహన్రెడ్డి, శ్రీనివాస్, కోట పుల్లారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం



తిరువూరులో మాట్లాడుతున్న రవికిశోర్

తిరువూరు: భారతీయ జీవిత బీమా సంస్థను ప్రైవేటీకరించడానికి కేంద్రప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమని అఖిలభారత ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికిశోర్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్లో శనివారం తిరువూరు ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయ పరిధిలోని ఏజెంట్ల సమావేశం జరిగింది. దేశంలోనే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్ఐసీ ప్రథమ స్థానంలో నిలవడానికి ఏజెంట్ల కృషే కారణమని, సంస్థను కాపాడుకోడానికి ఏజెంట్ల అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేయాలని, ఏజెంట్లకు పెన్షన్ సదుపాయం, డైరెక్ట్ మార్కెటింగ్ రద్దు తదితర డిమాండ్లను సంస్థ ఆమోదించాలని కోరారు. మచిలీపట్నం డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాంధీ రాంమోహన్రావు, పంతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నాగపూర్ ఉరుసు మహోత్సవానికి పయనం



నాగపూర్ తరలివెళ్తున్న పీఠాధిపతులు ఖాజా మొహియుద్దీన్, ఖలీల్బాబు, భక్త బృందం

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్ నుంచి శనివారం విజయనగరం, చీమలపాడు దర్బార్ల పీఠాధిపతులు సజ్జాదా నశీన్ మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్, మహమ్మద్ ఖలీల్బాబు ఆధ్వర్యంలో నాగపూర్కు బయలుదేరి వెళ్లారు. చీమలపాడులో వేం చేసి ఉన్న సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దివ్య సమాధి వద్ద చాదర్, గంధం, పూలు, సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం నాగపూర్ షరీఫ్లోని హుజుర్ తాజుద్దీన్ ఔలియా మహాత్ముల వారి 101 ఉరుసు మహోత్సవానికి భక్త బృందంతో తరలివెళ్లారు. ఈ నెల 14, 15,16 తేదీల్లో ఉరుసు జరుగనుంది. ఈ సందర్భంగా పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ మాట్లాడుతూ.. చీమలపాడు బాబా వారి దీవెనలతో వారి ఆశయం మేరకు నాగపూర్లో తాజ్ బాబా వారి ఉరుసు మహోత్సవానికి ప్రతి ఏడాది భక్త బృందంతో కలిసి వెళ్తున్నామన్నారు. అక్కడ నిత్యాన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించి బాబా వారికి చాదర్, గంధం, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు జరుపుతామన్నారు. పీఠాధిపతులకు భక్తులు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో తాజ్ ఖాదర్బాబు, భక్త బృందం పాల్గొన్నారు.

## కబేళాకు తరలిస్తున్న నాలుగు పశువులు పట్టివేత

కంచికచర్ల: పాడి పశువులను, ఆవులను కబేళాకు తరలిస్తే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం కోదాడ నుంచి నూజివీడులో కబేళాకు అక్రమంగా తరలిస్తున్న నాలుగు గేదెలను మండలంలోని కీసర టోల్ప్లాజా వద్ద శనివారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా పశువులు, ఆవులను కబేళాకు తరలించరాదని లేకపోతే ఆ పశువులను తరలిస్తున్న వాహనంతో పాటు డ్రైవర్ను అదుపులోకి తీసుకుంటామన్నారు. పట్టుకున్న పశువులను నందిగామ గోశాలకు తరలించామని, అక్రమంగా పశువులను తరలిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్నారు.